# బాబోయ్ వేషం వెయ్యను

శివరామ్‌కి నాటకాలు వెయ్యడమంటే వల్లమాలిన సరదా. నాటక కళని వుద్ధరించాలన్న ఆకాంక్ష గాని, నటనలో వున్న శిఖరాల్ని అధిరోహించి యెంతో పేరు ప్రఖ్యాతులు సంపాదించాలన్న వుబలాటం గాని అతనికి లేవు. కేవలం సరదాగా యేవో వేషాలు వెయ్యాలన్నదే అతని అభిమతం. ఆ అభిమతంతోనే, కాలేజీలో చదువుతున్నప్పట్నుంచి అడపా దడపా యేవో వేషలు నాటకాల్లో వేస్తూ వస్తున్నాడు.

నిజానికి, శివారామ్ పెద్ద నటుడేమీ కాదు. కాని, తాను ధరించే పాత్రని కూలంకషంగా అవగాహన చేసుకుని, దాన్ని సాఫీగా నడిపించగల సామర్థ్యం ఉన్నవాడే. అందుకే అతనికి గొప్పగా పేరు ప్రఖ్యాతులు లేకపోయినా, నాటక రంగానికి సంబంధించినంత వరకూ, చెడ్డపేరు మాత్రం లేదు.

ఉద్యోగ రీత్యా ఒక అంతస్తులో వుండి, యెన్నో బాధ్యతల్ని నిర్వహిస్తోన్న శివరామ్‌కి, మొహానికి రంగు పూసుకోవాలన్న సరదా, యింకా పూర్తిగా సమసిపోలేదు. అయితే, వేషాలు వేసే అవకాశం యిటీవల అతనికి రాలేదు. ఈ అవకాశం కోసం యెదురుచూడ్డం మానలేదు శివరామ్.

✪ ✪ ✪

తమ డిపార్టుమెంటు సాంస్కృతిక విభాగం వార్షికోత్సవం సందర్భంగా, ఒక నాటిక ప్రదర్శించాలన్న నిర్ణయాన్ని తీసుకున్నారు కార్యవర్గం వారు. శివరామ్ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని, ఆ నాటికలో ప్రముఖపాత్ర నిర్వహించమని దర్శకత్వపు బాధ్యత కూడా చేపట్టమని కార్యవర్గ సభ్యులు, అధికారులు శివరామ్‌ని కోరారు.

శివరామ్ యెంతగానో మురిసిపోయాడు. ఇటువంటి అవకాశం లభించినందుకు తనకున్న నాటకానుభవాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకున్నాడు.

లోగడ, నలుగురూ మెచ్చిన ఓ హాస్య నాటికను ఎంపిక చేశాడు శివరామ్. అందుబాటులో

ఉన్న డిపార్ట్‌మెంట్‌లోని నటుల్నే ఎంపిక చేశాడు. అంతగా ప్రాముఖ్యత లేని స్త్రీ పాత్రకు తమ ఆఫీసులోనే టైపిస్ట్‌గా పనిచేస్తోన్న 'సరోజ' అనే అమ్మాయిని ఆ చిన్న వేషం వేసేందుకు ఒప్పించాడు, శివరామ్.

నాటక రంగంలో కొద్దో, గొప్పో అనుభవం వున్నవాడు గనక, నాటక రిహార్సల్స్ పకడ్బందీగా సాగిస్తూ, దర్శకుడిగా తన బాధ్యతల్ని కడునేర్పుతో నిర్వహిస్తున్నాడు శివరామ్. నటుడిగానే గాకుండా, దర్శకుడిగా కూడా తనని నలుగురూ మెచ్చుకోవాలని, శివరామ్ అంతరంగంలో యెక్కడో అభిలాష లేకపోలేదు.

✪ ✪ ✪

అయితే రోజులు గడుస్తున్న కొద్దీ శివరామ్‌కి తన పాత్ర విషయంలోనే తృప్తి లేకపోతోంది. నటన, మూవ్‌మెంట్స్ బాగున్నా, వయస్సు మీద పడ్డం వల్ల గామోసు, మునుపటిలా పోర్షను జ్ఞాపకం వుండటంలేదు. ఈ మధ్య అలవాటు కూడా తప్పింది కదా. అప్పటికీ శక్తి వంచన లేకుండా, శ్రమిస్తూనే వున్నాడు. అయినా సరే ఆశించినంత ఫలితం అగుపించడంలేదు. ఈ విషయం శివరామ్‌కి కాస్తంత ఆందోళన కలిగిస్తూనే వుంది. అందుకనే, ఓ సారి తానా వేషం వెయ్యనని, మరో నటుడి చేత ప్రాక్టీసు చేయిస్తానని, ప్రకటించాడు కూడా. అయితేనేం - సహనటులు, స్నేహితులు, అధికారులు ఆ మార్పుకు అంగీకరించలేదు.

"ఆ వేషం, నువ్వు వేస్తేనే బావుంటుంది శివరామ్. ఎందుకూ అంటే, నటనలో అనుభవంతో పాటు, ఆ పాత్రకు తగ్గట్టు వయసూ వుంది. నీకు. చాలా సహజంగా ఉంటుంది. మరేం ఫరవాలేదు. నువ్వే బాగా చెయ్యగలవు. గోఎహెడ్..' అంటూ అతణ్ణి ప్రోత్సహించారు.

తప్పించుకోలేకపోయాడు శివరామ్. వేషాన్ని వెయ్యడం మినహా మరో మార్గం లేకపోయిందతనికి, అయితేనేం - మనసులో, అదో ఆరాటం, ఆందోళన వుంటూ వచ్చాయి.

పోర్షను చదవడంలోనూ, కంఠస్తం చెయ్యడంలోనూ, ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకున్నాడు. శివరామ్. అతనిలో పట్టుదల ఇనుమడించింది . కాని, జ్ఞాపకశక్తి పెరగలేదు. అయినా, ప్రదర్శనలో యెక్కడా లోటు లేకుండా చూడాల్సిన బాధ్యత, దర్శకుడిగానే కాకుండా నటుడిగా కూడా తనపైన వుందన్న సత్యాన్ని గుర్తించాడు. శివరామ్. అందుకనే, మొదట్నించీ రత్నం, కుమార్ అనే యిద్దరు చాకుల్లాంటి యువకుల్ని ప్రాంప్టర్సుగా పెట్టుకున్నాడు.

✪ ✪ ✪

రోజులు గడుస్తున్నాయ్.

మర్నాడే నాటిక ప్రదర్శన.

శివరామ్‌కి యెందుకో ఆత్మ విశ్వాసం లోపిస్తోంది. తన పోర్షను విషయంలోనే నమ్మకం లేకపోతుందతనికి. ఏదో తెలీని కంగారు, భయం, ఆందోళన అతణ్ణి ఆవహిస్తున్నాయ్. ఎంత శ్రమిస్తున్నా, తన జ్ఞాపకశక్తి మెరుగు కావడంలేదనిపిస్తోంది.

ప్రాంప్టర్స్ రత్నం, కుమార్‌లను పిలిపించాడు శివరామ్. కబురందడమే తడవుగా వాళ్ళిద్దరూ వచ్చేశారు.

"కూచోండి" అంటూ వాళ్ళిద్దరికీ తనకి అభిముఖంగా ఆసనాలు చూపించాడు శివరామ్.

రత్నం, కుమార్ ఆశీనులయ్యారు. తమకి లభిస్తోన్న గౌరవానికి మురిసిపోతున్నారు. "చెప్పండి సార్ !" గౌరవ పూర్వకంగా యిద్దరూ ఒకేసారి అన్నారు.

" రేపే మన నాటిక ప్రదర్శన" గుంభనంగా అన్నాడు, శివరామ్.

"ఔనుసార్, మాకు తెలీదాయేవిటి?" అన్నాడు రత్నం.

"తెలీదని కాదోయ్. ఓ సారి గుర్తు చేస్తున్నాను. అంతే! ఒక వాస్తవాన్ని విస్మరించొద్దు. మన నాటిక జయప్రదం కావాలంటే మీ యిద్దరి సహకారం చాలా వుండాలి" అన్నాడు శివరామ్.

తమకీ తగినంత ప్రాముఖ్యత నిస్తున్నందుకు రత్నం, కుమార్‌లు లోలోన పొంగిపోయారు. "అదంతా మాకు విడిచిపెట్టండి సార్. మేం యెంతగా అలవాటు పడిపోయామంటే, అందరి పోర్షన్లూ మాకు కంఠస్థమైపోయాయి. అంచేత యే యిబ్బందీ వుండదు. మీరు నిశ్చింతంగా వుండండి" వుత్సాహంగా చెప్పాడు కుమార్.

శివరామ్, సన్నగా మందహాసం చేశాడు. "ఈనాటి వుత్సాహం, నిబ్బరం, మీలో వుండాలోయ్. నిజం చెప్పాలంటే, యీ నాటి ప్రాంప్టర్సే, రేపటి నటులు. నేనూ ఒకప్పుడు ప్రాంప్టింగు చెప్పిన వాణ్ణేనోయ్. రేపు మీరు యెంతో అలర్టుగా వుండాలి. వచ్చేసారి మనం వెయ్యబోయే నాటికలో, మీకు వేషాలు ఖాయం" హామీ ఇచ్చాడు శివరామ్.

రత్నం, కుమార్ ముసి ముసిగా నవ్వుకున్నారు. తాము కూడా త్వరలో నటుల జాబితాలోకి చేరబోతున్నామని ఆనందం వారిలోవెల్లి విరిసింది.

"మీ అభిమానానికి ధన్యవాదాలు సార్, ఆపాటి హామీ ఇచ్చారు చాలు. రేపటి గురించి మీరేం

కంగారు పడకండి. మేమున్నాంగా,మరి సెలవిప్పించండి" అన్నాడు రత్నం తృప్తిగా.

"సరే వెళ్ళి రండి. ఇవ్వాళ సాయంత్రం ఏడింటికి స్టేజి రిహార్సల్స్ వున్నాయని తెలుసుకదా, పెందరాళే వచ్చేయండి" ఓ సారి గుర్తుచేశాడు శివరామ్.

"అలాగే సార్. వస్తాం మరి" అంటూ రత్నం, కుమార్ నిష్క్రమించారు.

శివరామ్, తృప్తిగా ఓ విశ్వాసం వదిలాడు. రత్నం, కుమార్‌ల ప్రాంప్టింగ్ ప్రతిభ పట్ల అతనికి పూర్తి విశ్వాసం కలిగింది.

✪ ✪ ✪

ఆ రోజే నాటిక ప్రదర్శన

డిపార్టుమెంటు కార్యక్రమం కాబట్టి ఆర్థికంగా ఇబ్బందులేమీ వుండవు. అందుకే ప్రవేశ ద్వారం దగ్గర 'సుస్వాగతం' బోర్డుతో పాటు, రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. లౌడు స్పీకర్లోంచి సినిమా పాటలు వినిపిస్తున్నాయి.

హాలు, క్రమంగా ప్రేక్షకులతో నిండిపోయింది. వెనుక వేపు అదనంగా కుర్చీలు వేస్తున్నారు. నాటిక ప్రదర్శన కోసం, విచ్చేసిన ప్రేక్షకులంతా ఆసక్తితో యెదురు చూస్తున్నారు.

సినిమా పాటల్ని ఆపేశారు. హాల్లోని లైట్లన్నీ ఆరిపోయాయి. అంటే, నాటిక ప్రదర్శన ప్రారంభవుతుందని హెచ్చరికన్న మాట ! ప్రార్థన ముగిసింది.

హాల్లో అంతా చీకటి, నిశ్శబ్ధ వాతావరణం. మెల్లగా తెర తొలగింది. డిమ్ లైట్లు క్రమంగా వెలుగును ప్రసరించాయి. ప్రయోక్త తొలి పలుకుల్తో, నాటిక ప్రారంభమయ్యింది. కథానుగుణంగా పాత్రలు స్టేజి మీదకి కొచ్చాయి.

హాస్య నాటిక కావడం వల్ల, ప్రారంభం నుంచీ సరదాగానే సాగింది. ప్రేక్షకులు నవ్వుల పువ్వులు విసురుతున్నారు.

శివరామ్ నటిస్తున్న పాత్ర, చాలా ప్రాముఖ్యత గలది. వయస్సు దృష్ట్యా, మేకప్ దృష్ట్యా, అతనికా పాత్ర సరిగ్గా సూటయ్యింది. సహజత్వం వుట్టిపడుతోంది. దానికి తోడు, ఆ పాత్రకి రచయిత రాసిన డైలాగులు ప్రేక్షకుల్ని గిలిగింతలు పెడుతూ నవ్విస్తున్నాయ్. తన పాత్రకి అంత గొప్ప ఆదరణ కలుగుతున్నందుకు, మహదానందం కలిగింది శివరామ్‌కి. ఆ పాత్రకి, తాను నిజంగానే న్యాయం చేకూరుస్తున్నానని లోలోన సంబరపడిపోయాడు.

ఆ సంబరంలో, ఆ ఆనందానుభూతిలో, శివరామ్ తన పోర్షను మర్చిపోయాడు. సాఫీగా సాగిపోతోన్న నాటిక ప్రదర్శనకు, సడన్‌గా బ్రేకుపడింది. ఇలా జరుగుతుందని, అతనూ వూహించలేదు. ఏం చెయ్యాలో తోచక సైడ్ వింగ్స్ కేసి చూశాడు. ఇరువైపుల నుంచి రత్నం, కుమార్ పోర్షన్ని అందిస్తున్నారు. అయినా, అతనికేమీ వినిపించడంలేదు. అతనితో పాటు స్టేజి మీదున్న మరో నటుడు కూడా శివరామ్‌కి డైలాగులు అందిస్తున్నాడు. కాని, వాటినీ అందుకునే స్థితిలో లేడు శివ రామ్. ఆ క్షణాలే వేరు. గొప్ప టెన్షనుగా వుంటుంది మరి. జేబులోంచి రుమాలు తీసి, మొహం ఒత్తుకున్నాడు శివరామ్.

ఊహించని యీ హఠాత్పరిణామానికి, ప్రేక్షకుల్లో కలకలం ప్రారంభమయ్యింది. నవ్వుల జల్లులతో రక్తిగా సాగిపోతున్న ఆ నాటిక ప్రదర్శనకి ఇలా గ్రహణం పట్టడం, వారకి నిరుత్సాహం కలిగించింది. నిజానికి, ఆ నాటిక ప్రదర్శన బావుంటుందనే చాలా మంది వచ్చారు. అటువంటిది, యిలా ఆటంకం కలగడం, వారి ఆనందానికి ఆనకట్ట కట్టినట్టే అయ్యింది మరి. కొందరు నిట్టూర్పులు విడిచారు. అకతాయి కుర్రాళ్లు, అరుపులు ప్రారంభించారు. ఆ నిశ్శబ్ద వాతావరణంలో, అనుకోకుండా అలజడి ఆరంభమయ్యింది.

శివరామ్ కంగారు పడిపోయాడు. ఇరువైపుల సైడు వింగ్సులో వున్న రత్నం, కుమార్ పోర్షన్ని కాస్త గట్టిగా చెబుతున్నా, ఆ అరుపులు నేపథ్యంలో, అవేం వినిపించడం లేదు, శివరామ్‌కి. ప్రేక్షకుల్లోంచి వస్తోన్న అరుపులు, యీలాలే వినిపిస్తున్నాయి.

ముచ్చెమటలు పోసాయి శివరామ్‌కి. అవమానంతోపాటు, విసుగూ పుట్టిందతనికి. ప్రాంప్టర్స్ యీ విధంగా విఫలమవుతారని, అతనెప్పుడూ వూహించలేదు. ఆయన ప్రాంప్టర్స్‌నే నిందిస్తున్నాడు గాని నిజానికి అది తన వైఫల్యమేనని, ప్రాంప్టింగ్ అందుకోలేని అశక్తత తనదేనని భావించడం లేదు. అతని మొహం, కోపంతో యెర్రబారింది.

సైడు వింగులో వున్న ప్రాంప్టర్ రత్నం కేసి గుర్రుగా చూశాడు శివరామ్.

"చెప్పవయ్యా రత్నం..." విసురుగానే అన్నాడు.

రత్నం కూడా చెమటలు పోస్తున్నాడు పాపం! జేబులోంచి రుమాలు తీసి మొహం ఒత్తుకుంటూనే డైలాగుల్ని మరికాస్త గట్టిగా అందించాడు.

రత్నం అందిస్తోన్న డైలాగులు, ప్రేక్షకులకే వినిపిస్తున్నాయి. ప్రేక్షకులేం తెలివితక్కువ వాళ్లు కాదు కదా, వాళ్లని మోసగించడానికి?

"మీరెందుకండీ! ప్రాంప్టర్సే స్టేజి మీది కొచ్చేసి డైలాగులు చెప్పేస్తే పోయేదిగా?" అంటూ ప్రేక్షకుల్లోంచి ఒకరు అరిచారు.

అంతే! ప్రేక్షకులంతా గొల్లున నవ్వేరు. ఆ నవ్వుల సవ్వడిలో ప్రాంప్టరు చెప్పింది వినిపించలేదు, శివరామ్‌కి.

శివరామ్ పరిస్థితి, దయనీయంగా వుంది. అతను, అయోమయ స్థితిలో, అటూ, యిటూ పచారు చెయ్యడం ప్రారంభించాడు. అతనితోపాటు స్టేజి మీదున్న మరో వ్యక్తి కోపంతో మొహం చిట్లించుకున్నాడు. లోలోన యేదో గొణుక్కుంటున్నాడు.

ప్రాంప్టర్లు అదేపనిగా చెబుతూవున్నా, శివరామ్ తన డైలాగుల్ని అందుకోలేకపోతున్నాడు. ఎంతసేపని ఇలా పచారు చేస్తాడు? విసురుగా సైడు వింగులోకి నడిచాడు.

సాధారణంగా, యిది జరగని విషయం. కాని, యిప్పుడు. జరిగింది ప్రేక్షకులు. గొల్లుమన్నారు. నవ్వులు... కేరింతలు... యీలలు... అంతా గందరగోళంగా తయారయ్యింది. నాటిక కంటే, స్టేజి మీద జరుగుతోన్న యీ తతంగమంతా వాళ్లకో వినోదంలా తోచింది.

శివరామ్, ప్రాంప్టర్ రత్నంని నాలుగు చీవాట్లు వేసి, తన డైలాగుల్ని ఓసారి చదువుకున్నాడు.

స్టేజి మీదున్న రెండో పాత్ర నటుడు గుడ్లప్పగించి చూడ్డం మినహా, మరేవీం చెయ్యలేని నిస్సహాయ స్థితిలో నిల్చున్నాడు. అతని మొహంలో ఆవేశం, ఆవేదన సమ్మిళితమైన భావాలు స్పష్టంగా అగుపిస్తున్నాయి.

శివరామ్, తన డైలాగుల్ని మననం చేసుకుంటూ, స్టేజి మీదికి వచ్చేశాడు.

"మీ పోర్షను చదువుకుని వచ్చారా మహానుభావా" అని ఓ ప్రేక్షకుడంటే,

"పుస్తకం తెచ్చుకుని చదివేయకూడదండీ?" అని మరో ప్రేక్షకుడన్నాడు.

ఇంక చెప్పేదేముంది. ప్రేక్షకులంతా మళ్లీ నవ్వుల జడివాన కురిపించారు.

ప్రేక్షకులు అలా గోల పెడుతూ వుంటే, యేకాగ్రత యెక్కడుంటుంది? తాను చదువుకుని వచ్చిన డైలాగుల్ని మళ్లీ మర్చిపోయాడు. శివరామ్. అతనికి తన కొట్టేసినంత పనయ్యింది. ఎంత బుర్ర బద్దలుకొట్టుకున్నా డైలాగులు జ్ఞప్తికి రావడంలేదు. నిజంగా, తాను దురదృష్టవంతుడే అనుకున్నాడా క్షణంలో. బుద్ధిగడ్డితిని నాటికలో వేషం వెయ్యడానికి అంగీకరించానని పశ్చాత్తాపపడకుండా వుండలేకపోయాడు శివరామ్. అప్పుడనుకుని యేం లాభం? జరగాల్సిన

ప్రమాదం జరిగేపోయింది.

తెల్లమొహం వేసి, సైడు వింగ్సకేసి చూస్తోన్న శివరామ్‌కేసి చూసి, ప్రేక్షకులు నవ్వుకుంటూనే తలోమాటన్నారు. నిజమే మరి! ప్రేక్షకులు సర్వస్వతంత్రులు. వాళ్లేమైనా అనొచ్చు కదా!

"ఇంత మతి మరుపున్నవాడిని, వేషం వేసేందుకు యెందుకు తయారయ్యావు బాబూ?" అరిచారెవరో

ప్రేక్షకుల్లో మళ్లీ నవ్వులు.... కేరింతలు.

శివరామ్‌కి యేం చెయ్యాలో తోచలేదు. ఆఖరి ప్రయత్నం ఆ "చెప్పవయ్యా కుమార్ ..." అన్నాడు కోపంగా.

స్టేజి మీద అలా అంటే, యింకేమైనా వుందా? ఇది మొదటిసారి కాదు. రెండోసారి కాదు. అది నాటికల పోటీ కాకపోయినా, వార్షికోత్సవ కార్యక్రమమే అయినా, యిటు వంటి చర్యకి యే ప్రేక్షకుడూ హర్షించరు... నటుల్ని క్షమించరు.

ప్రేక్షకులు సహనాన్ని కోల్పోయారు. "ఇంకెన్ని సార్లు చెప్తారండీ? గొప్ప నాటకమే వేశారు... చాల్లెండి... కర్టెను డ్రాప్ చెయ్యండి..." అంటూ ప్రేక్షకుల్లోంచి యెన్నో కంఠాలు ముక్తంగా అరిచినయ్.

మళ్లీ అందరూ గొల్లుమన్నారు. ముందు వరుసలో కూచున్న డిపార్టుమెంటు అధికారులు, కార్యవర్గ సభ్యులు మొహాలు దించేసుకున్నారు.

పాపం, శివరామ్ పరిస్థితి మరీ అధ్వాన్నంగా వుంది. అవమానంతో గుండెలవిసిపోయినయ్. ఇంక మరేవీ ఆలోచించలేదు. విసుగుగా లోపలికి పోయి డ్రాప్ కర్టన్ పడేశాడు.

"ఇంతటితో యీ నాటిక ముగిసిందని తెలియజెయ్యడానికి యెంతో విచారిస్తున్నాను. ప్రేక్షక మహాశయులు, సహృదయంతో అర్థం చేసుకుని, క్షమిస్తారని ఆశిస్తున్నాను.." అంటూ లోపల్నించే మైకులో చెప్పేశాడు శివరామ్.

హాల్లో లైట్లు వెలిగినయ్.

నిరాశతో నిండిన ప్రేక్షకులు, యెన్నో విమర్శలు చేస్తూ, కొండకచో నిర్వాహకుల్ని, శివరామ్‌ని నిందిస్తూ బైటికి నడుస్తున్నారు. కొందరైతే, బేడ్జీలు తగిలించుకున్న కార్యకర్తల్నీ చూసి, ఛీదరించుకుంటున్నారు.

హాలు, ఖాళీ అయ్యింది. కార్యకర్తలే మిగిలారు. అధికారులు, కార్యకర్తలు, స్టేజి మీదికి వెళ్లారు.

వాళ్లంతా, శివరామ్‌ని నిందించారు.

"మన డిపార్టుమెంటు పరువు ప్రతిష్ఠలు యెంతగా దెబ్బతిన్నాయో, ఆలోచించావా శివరామ్? ప్రేక్షకులు యెట్లా ఆడిపోసుకుంటూ వెళ్లారో విన్నావా? ఇంత జ్ఞాపకశక్తి లేని వాడివి, యీ వేషం వెయ్యడానికి యెందుకు అంగీకరించావు?" అన్నాడో అధికారి.

శివరామ్, యేం జవాబు చెప్తాడు? మౌనమే శరణ్యమయ్యిందతనికి.

"శివరామ్‌గారూ, వుత్సాహం, కొద్దీ, మొహాలకి రంగుపూసుకుని నటులుగా రంగస్థలం మీదికొచ్చిన నాలాంటి వారికి యిదో చేదు అనుభవమండీ?" అవేదనతో అన్నాడు శివరామ్‌తో పాటు స్టేజిమీద దిక్కుతోచని స్థితిలో వున్న నటుడు.

శివరామ్ మొహం దించేసుకున్నాడు. అతని కళ్లల్లో నీళ్లు గిర్రున తిరిగినయ్. అతని హృదయం పశ్చాత్తాపంతో దహించుకుపోతోంది.

"జరిగిన దానికి నేనెంతగానో బాధపడుతున్నాను. నాకూ నలుగురిచేత 'సెహభాష్' అనిపించుకోవాలనే వుంటుంది గాని అభాసు పాలుకావాలని వుండదు కదా. ఈ రోజు యిట్లా జరగడం నా దురదృష్టమే. దీనికి నాలోనే నేను యెంతగా కుమిలిపోతున్నానో, పరితపిస్తున్నానో మీ కెవ్వరికీ అర్థం కాదండీ, కాని, యేం చెయ్యగల్ను ? జరిగిందేదో జరిగిపోయింది. నా జీవితంలో, యిదో మరువరాని ఘట్టం. ఈ రోజు నించీ యింకెప్పుడూ నాటకాలు వెయ్యనని హామీ యిస్తున్నాను..." అన్నాడు గొంతు జీరవోయింది.

అంతకంటె, యింకేం చెయ్యగలడు శివరామ్? ఎవ్వరూ యింకేవీ అనలేకపోయారు....

□□□

('రచన' మాసప పత్రిక)